క్లుప్తంగా

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి



రెవెన్యూ సమస్యలపై సూచనలు చేస్తున్న రెవెన్యూ శాఖ జిల్లా అదనపు డైరెక్టర్ లక్ష్మణరావు

భామిని: మండలంలో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు, భూయజమానులు అర్జీల రూపంలో తెలియజేసిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ శాఖ జిల్లా అదనపు డైరెక్టర్ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా అందిన సమస్యలను తెలుసుకుని, పలు సూచనలు చేశారు. ఈయన వెంట తహసీల్దార్ ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



పూడేస్‌లో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కొమరాడ: మండలంలోని చోళ్లపథం, పూడేస్, లంజి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం భూమిపూజ చేశారు. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాలు మెరుగు పరుస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు.

గోశాలలు ప్రారంభం

జియ్యమ్మవలస: మండలంలోని బీజేపురం, బొమ్మిక గ్రామాల్లో కొత్తగా నిర్మించిన గోశాలలను ఎంపీపీ బొంగు సురేష్ శుక్రవారం ప్రారంభించారు. పాడిరైతులంతా ఈ గోశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రమేష్, ఏపీవో శ్రీనివాసరావు, నాయకులు డి.లక్ష్మణరావు, డి.రామకృష్ణ, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట: ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకుంటున్న భక్తులు



పాలకొండ రూరల్: నక్కలపేటలో ఉత్తర ద్వారం నుంచి దర్శనమిస్తున్న స్వామివారు

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి..

పాలకొండ రూరల్: మండల పరిధిలోని పలు ఆలయాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశిని భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లోని ఉత్తర ద్వారం గుండా భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యంగా వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని అన్నవరంలో గల వేంకటేశ్వర ఆలయంతో పాటు పట్టణ పరిధిలో గల సీతారామ, కోదండరామ ఆలయాలు.. నక్కలపేటలో గల శ్రీరామ సీతా సమేత రాధాగోపాల మందిరంలో ఉత్తర ద్వారా దర్శనాలు జరిగాయి.

– వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

సీతంపేట: టీటీడీ ఆధ్వర్యంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సందడి వాతవరణం నెలకొంది. స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎస్సై వై. అమ్మన్నరావు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

గుమ్మలక్ష్మీపురం:

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు సూచించారు. మండలంలోని తాడికొండ పీహెచ్‌సీని ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి, అక్కడి రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, సదుపాయాలు, సిబ్బంది పనితీరు, మందుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులకు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. 24 గంటలూ వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. గర్భిణులు, బాలింతలు, బాలికల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలన్నారు. అలాగే తాడికొండకు చెందిన తోయక ప్రకాష్ మృతిపై ఆరాతీశారు. ఆస్పత్రిలో సరైన వైద్యం సకాలంలో అందించలేకపోవడం వల్లే సదరు వ్యక్తి చనిపోయాడని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, ఎంపీపీ కుంబురుక దీనమయ్యలు చేసిన ఆరోపణల నేపథ్యంలో ప్రకాష్ మృతి ఘటనపై సిబ్బందిని నిలదీశారు. వైద్యం కోసం ఆస్పత్రిని ఆశ్రయించే వారికి వారు సంతృప్తి పడేలా సేవలందించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ జగన్‌మోహన్‌రావు, వైద్యాధికారులు ఎం.బుద్ధేశ్వరరావు, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

పురుగుమందు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి సహా సీమనాయుడువలస గ్రామంలోని పురుగుమందు దుకాణాల్లో ఏవో జ్యోత్స్న శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పురుగుమందుల నిల్వలు, వాటి ధరలు, స్టాకు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎంఆర్‌పీ ధరకే పురుగుమందులు విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేన్సర్ వ్యాధికి కారణమైన గ్లైపోసెట్ మందు విక్రయించవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఏఏవో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి..



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న రమణారావు

పాలకొండ: మున్సిపల్ (ఆప్కాస్) కార్మికులకు సమ్మె కాలపు హామీలకు సంబంధించి వెంటనే జీఓలు ఇవ్వాలని కోరుతూ కార్మికులు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పాలకొండ నగర పంచాయతీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ శిబిరాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ సమ్మె ఒప్పందాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని కోరారు. జీఓ 36 ప్రకారం కార్మికులకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్, రిస్క్ అలవెన్స్, తదితర వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ సంజీవి, ఎస్.సాయికుమార్, సీహెచ్.కార్తీక్, పి.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

● వితరణ..

మండలంలోని గోపాలపురంలో జీఎంఆర్ సంస్థ సమకూర్చిన దుస్తులను సంక్రాంతి పండగ నేపథ్యంలో సర్పంచ్ ఎస్.జగదీష్‌కుమార్ పలువురు పేదలకు శుక్రవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శశిభూషణరావు, జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. – పాలకొండ రూరల్



క్రీడలతో మానసికోల్లాసం

గుమ్మలక్ష్మీపురం: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని హెచ్ గ్రౌండ్ వద్ద మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. రన్నింగ్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో తదితర క్రీడాపోటీలు జరగ్గా, స్త్రీ, పురుషులు మొత్తం 80 మంది పాల్గొని, వారిలోని క్రీడాప్రతిభను ప్రదర్శించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి ఎస్ఐ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.అరుణభాస్కర్, సెక్రటరీ పి.చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చేతిబోరు ఏర్పాటుకు శంకుస్థాపన

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు వయా కోటిపల్లి గ్రామాల మధ్య రాకపోకలు సాగించే ప్రజల దాహార్తి తీర్చేందుకు చేతిబోరు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి సర్పంచ్‌ల సంఘ మండల ఉపాధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఇరు గ్రామాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. బోరు ఏర్పాటైతే ప్రజల తాగునీటి ఇబ్బందులు తొలగనట్లేనని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

నమ్మకానికి మారుపేరు యిండుపూరు జ్యూయలర్స్



యిండుపూరు గున్నేశ్వరరావు



యిండుపూరు వెంకటేష్

గత నాలుగు తరాలుగా పార్వతీపురం పట్టణంలో బంగారం, వెండి వ్యాపారం చేస్తూ యిండుపూరు జ్యూయలర్స్ ఈ ప్రాంతంలో ప్రజల మన్ననలను పొందుతున్నారు. నాలుగోతరంలో యిండుపూరు గుంపస్వామి, వెంకట్రావు, గున్నేశ్వరరావు, వెంకటేష్‌లు బంగారం వ్యాపారం చేస్తూ ఈ ప్రాంతీయుల ఆదరాభిమానాలను చూరగొంటున్నారు. యిండుపూరు గున్నేష్ కుమారుడు వెంకటేష్ లండన్‌లో ఎంబీఏ చదివి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడినప్పటికీ తాతముత్తాతల నాటి బంగారం, నగలు, వెండి వ్యాపారం కొనసాగించాలనే ఉద్దేశంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సైతం విడిచిపెట్టి పార్వతీపురంలో యిండుపూరు జ్యూయలర్స్ పేరుతో బంగారం వ్యాపారం ప్రారంభించారు. కార్పొరేట్ వ్యాపారులు పట్టణానికి వచ్చినప్పటికీ ప్రజలు తమ మీద ఉన్న నమ్మకంతో తమ వ్యాపారం నిరాటంకంగా కొనసాగుతోందన్నారు. యిండుపూరు గున్నేశ్వరరావు రాజకీయంలో క్రియాశీలకంగా వ్యవహరించి వ్యాపారులకు, ప్రజలకు అండదండగా ఉంటున్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి శుభాకాంక్షలను ఖాతాదారులకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

గిరిజనుల ప్రాణాలంటే లెక్కలేదా?

గుమ్మలక్ష్మీపురం: గిరిజనుల ప్రాణాలంటే లెక్కలేదా అని వైఎస్సార్ సీపీ నాయకుడు గోరిశెట్టి గిరిబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందితే మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రభుత్వం ప్రకటించిందని, కానీ గుమ్మలక్ష్మీపురంలో ఇటీవల జరిగిన కందికొత్తలు పండగలో ఓ గిరిజన యువకుడు చనిపోతే మాత్రం ప్రభుత్వం ఎందుకు పరిహారం ప్రకటించలేదని నిలదీశారు. గిరిజనుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. గిరిజనులవి కూడా ప్రాణాలేనని, వారిని కూడా బాగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తక్షణమే చనిపోయిన గిరిజన యువకుడి కుటుంబానికి పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పరిశీలన



చిన్నారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: మండలంలోని దారపాడు పంచాయతీ పరిధి రామానగరం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ గీతాంజలి శుక్రవారం సందర్శించారు. పిల్లలకు ఎటువంటి పౌష్టికాహారం అందిస్తున్నదీ, అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని సిబ్బందికి సూచించారు.

త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. శుక్రవారం ఆ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన.. పనుల్లో జాప్యం జరగకుండా చూడాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. నిర్దేశిత సమయానికి ముందు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.



నిర్మాణ పనుల పరిశీలనానంతరం మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురంలో అందుబాటులో ఐవీఎఫ్ సేవలు



డా. ధీరజ్ యాళ్ల



డా.దీపక్ వంశీ యాళ్ల

కుటుంబ్ ఐవీఎఫ్ కేంద్రం సేవలు పార్వతీపురంలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కంటివైద్య నిపుణుడు డాక్టర్. యాళ్ల వివేక్ తెలిపారు. విశాఖపట్నంలోని కేజీహెచ్ డౌన్‌లో గత రెండేళ్ల క్రితం కుటుంబ్ సంతాన సాఫల్య కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. రోజురోజుకు సంతాన సాఫల్యతలో ఇబ్బందులు ఎదుర్కొనడంతో ఈ ప్రాంతీయులకు అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో తను పుట్టి పెరిగిన పార్వతీపురంలోని ప్రధాన రహదారిలో కుటుంబ్ సంతాన సాఫల్య కేంద్రాన్ని ప్రముఖ వైద్యుడు డా.యాళ్ల వివేక్ కుమారుడు యాళ్ల ధీరజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సంతాన సాఫల్యతకు సంబంధించి తనిఖీలను, చికిత్సలను నిర్వహిస్తున్నారు. ఆయన చెన్నైలోని ప్రముఖ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఐవీఎఫ్ డిగ్రీని అందిపుచ్చుకున్నారు. జీనీఫెమినా, జీనీ యాండ్రో అనే ఆధునాతన సాంకేతిక ప్రక్రియల ద్వారా పురుషులతో పాటు మహిళల్లోను వంధ్యత్వ నివారణకు చికిత్సలను అందిస్తున్నట్లు డాక్టర్ ధీరజ్ తెలిపారు. పార్వతీపురం వాసులకు ప్రతి శని, ఆదివారాలు చికిత్స కేంద్రంలో అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారు. అలాగే ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ దీపక్ వంశీ ప్రతినెల 1,3వ ఆదివారాలు కుటుంబ్ సంతాన సాఫల్య కేంద్రానికి వచ్చే రోగులకు అందుబాటులో ఉంటున్నారు.

ప్రజలకు అందుబాటులో పెథాలజీ సేవలు



డా.మరడాన చాందిని



డా.బోను రవిచంద్ర

గతంలో మెట్రోనగరాలకే పరిమితమైన వైద్యసేవలు సమీపంలోని పట్టణాలలో కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో వైద్యసేవలను అందించాలనే లక్ష్యంతో ధన్వంతరి ఆస్పత్రిని పార్వతీపురం పట్టణ నడిబొడ్డున నెలకొల్పారు. వ్యాధి నిర్ధారణకు సంబంధించిన పెథాలజీ పరీక్షలు ప్రస్తుతం పార్వతీపురం పట్టణంలో అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంతీయులకు దూరాభారంతో పాటు వ్యయప్రయాసాలు కూడా తగ్గాయి. ధన్వంతరి ఆసుపత్రిలో స్త్రీ వైద్య నిపుణురాలు డా.మరడాన చాందిని స్త్రీలకు సంబంధించి వ్యాధులకు తనిఖీలు నిర్వహించడం, శస్త్ర చికిత్సలను నిర్వహించడంతో పాటు స్కానింగ్‌లు, లాప్రోస్కోపిక్, చికిత్సలు నిర్వహిస్తున్నారు. పేద,మధ్య తరగతివారికికూడా సేవలను అందించేందుకుగాను ప్రతి నెలా ఆస్పత్రిలో ఉచితవైద్య శిబిరాలను నిర్వహించి తనిఖీలను, అవసరమైన రక్త పరీక్షలను నిర్వహించి ఈప్రాంతీయుల అభినందనలు చూరగొంటున్నారు. అలాగే ఈ ఆస్పత్రిలో సుగర్ వ్యాధికి, ఊపిరితిత్తులకు సంబంధించి తనిఖీలను, చికిత్సలను వ్యాధి నిపుణుడు డా.బోను రవిచంద్ర సేవలను అందిస్తున్నారు.

పచ్చకామెర్లపై అవగాహన అవసరం



డా.మూడడ్ల రోహిత్

ప్రతి ఒక్కరూ పచ్చకామెర్లు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రాలజిస్ట్ డా.మూడడ్ల రోహిత్ పేర్కొన్నారు. మన రక్తంలో బిలిరుబిన్ స్థాయి రెండు పాయింట్‌లకంటే ఎక్కువగా ఉన్నట్లైతే వైద్య పరిభాషలో పచ్చకామెర్లుగా పేర్కొంటారన్నారు. కామెర్లు వచ్చే ప్రతి వంద మందిలో పదిమందికి క్లోమగ్రంథి క్యాన్సర్ సోకే అవకాశం ఉంటుంది. కామెర్లుపై గ్రామీణ ప్రాంత ప్రజకు అవగాహన లేకపోవడంతో పసరుమందులపై ఆధారపడడంవల్ల క్యాన్సర్, కిడ్నీ సమస్యలు ఉత్పన్నమై ఒక్కోసారి రోగి ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు. ప్రాథమిక దశలోనే క్లోమగ్రంథి క్యాన్సర్ (ప్యాంక్రియాటిక్)ను గుర్తిస్తే శస్త్రచికిత్సతో వ్యాధిని నివారించడానికి అవకాశం ఉంటుంది. కామెర్లును మందులతో నివారించడమే కాకుండా హెపటైటిస్ బి వ్యాక్సిన్‌తో ప్రాణాంతక వ్యాధిని కూడా నివారించవచ్చునని పేర్కొన్నారు. ఆయన విశాఖపట్నంలో గీతం మెడికల్ యూనివర్సిటీ ఆస్పత్రిలో చికిత్సలను అందిస్తుంటారు. స్వగ్రామంలో ప్రజలకు అందుబాటులో సేవలను అందించాలనే లక్ష్యంతో తన తాతగారు కీ.శే. మూడడ్ల ఎరుకునాయుడు ఆశయసాధనకు ప్రతి ఆదివారం పట్టణంలోని గూడ్స్‌షెడ్ రోడ్‌లోని ఎంవైఎన్ పాలిక్లినిక్‌లో తనిఖీలను, చికిత్సలను నిర్వహించి ఈప్రాంతీయుల మన్ననలను పొందుతున్నారు.